


(20 వ భాగము)

"ఇవాళ తేదీ ఎంత?"

"ఎలా తెలుస్తుంది మనకు?"

"ఎలాగైనా ప్రయ్నత్నం చేసి తెలుసుకోవాలి! మనం ఆ రోజుకు ఎన్ని రోజులు ముందున్నామో తెలుసుకుంటే, ఈ దీవినుండి తప్పించుకువెళ్ళే ప్రయత్నం చెయ్యవచ్చు" అంది డెల్లా కాస్త ధైర్యం తెచ్చుకొని.

ఆమె చెప్పింది బాగానే వుంది. అడవుల్లో, తిరిగి, సముద్రాల్లో చిక్కుబడి వచ్చిన మాకు, తేదీలు, వారాలు, నెలలు తెలియటం ఆగిపోయి ఎన్నో దినాలైంది. ఒక వేళ తెలుసుకొన్నా పెద్ద ప్రయోజనం వుంటుందనిపించలేదు నాకు. కారణం, ఈ దీవి దాటేందుకు చుట్టూ సముద్రాలే వున్నాయి. ఏదయినా చిన్న పడవన్నా సాయం లేకుంటే

ఎలా తప్పించుకోవడం.

పడవ దొరికినా మేం మధ్యసముద్రంలో వుండగానే అలాంటి గాలి వీచిందంటే చేయగలిగిందాట్టే వుండదని పించింది. ఇవన్నీ డెల్లాకు చెప్పడం నా కిష్టం లేక ఊరుకున్నాను.

పై అంతస్తునుండి క్రింది అంతస్తుకు వచ్చాం. అక్కడి గదులన్నీ వెతికాను. ఒక గదిలో గోడకు ఎత్తుగా డిజిటల్ వాల్ క్లాక్ వ్రేలాడుతూంది. అందులో అన్ని వివరాలు వున్నాయి. ఆ గడియారం ఆడుతుందో లేదో నని చూశాను. దానికి పెండ్యూలం లాటి దేదీ లేదు. సోలార్ ఎనర్జీతో నడుస్తున్నట్లుంది. సెకండ్ల ముల్లు తిరగటం కనుపించింది.

ఈరోజు ఆదివారమని తెలుసుకున్నాను. తేదీ ఇరవై నాలుగు. టయమ్ పన్నెండు గంటలా నలభై నిముషాలయింది. అంటే మరో ముప్ఫయి అయిదు గంటలా పదిహేను నిముషాల వ్యవధి మాత్రం వుంది మా ప్రాణాలు పోయేందుకు.

గాలిలో ఆక్సిజన్ శాతం తగినంత లేకపోవటంవల్లే మాకు అంతకుముందునుండి సరిగ్గా ఊపిరి ఆడలేదని అర్థం చేసుకున్నాను. రాబోయే విపత్కర వాతావరణకు సూచనలు అప్పుడే ప్రారంభ మయినాయి. అంటే శాస్త్రజ్ఞులు అంచనా వేసిన ప్రకారం ఆక్సిజన్ లేని విషపుగాలి రావడం నిజమన్న విషయం నా మనస్సుకు తెలిసిపోయింది.

"మన మేం బ్రతుకులు?" అంది డెజ్లా నిరీహతో.

"అంటే...!" అడిగాను.

"అడుగడుగునా ఆపదలే! మీ దేశం చూద్దామని బయలుదేరిన క్షణంనుండీ ఇప్పటిదాకా నిలకడగా ఒక్క చోట వుండగలిగామా? ప్రాణాలకు ముప్పు లేదన్న ధైర్యం ఎప్పుడైనా కలిగిందా? ఇలా అనుక్షణం ఛస్తు బ్రతకడం కన్నా ఒక్కమారుగా చావడం మేలనిపిస్తూంది!" అంది డెల్లా.

"అలా నిరాశపడిపోకు! ప్రతి చీకటి రాత్రీ కొంత వ్యవధి పోయాక వెలుగు వెల్లువను చూస్తూనే వుంటుంది. అలాగే మన స్థితికూడాను" అన్నాను ధైర్యం చెపుతూ.

"ఇంతదాకా మనుష్యులతోనే పోరాడాం! వాళ్ళ యుక్తులు, శక్తులు అవగాహన చేసుకోగలిగాం గాబట్టి ఎదురు ఎత్తులు వేశాం. తప్పించుకున్నాం. ఈ మారు మన పైన పగ చూపింది ప్రకృతి. దాన్ని ఎదుర్కొనే దారి శూన్యం. మనకీ దీవిలో చావు తప్పదు. భగవంతుడు వున్నాడన్న నమ్మకం మనకుంది. ఆయన్ని ప్రార్థించు కోవటం మంచిది" అంది డెల్లా.

విషపుగాలి వీచేందుకు మరో ముప్ఫయ్యారు గంటల వ్యవధి వుంది. ఈలోగా ఈ దీవినుండి దూరంగా వెళ్ళి పోగలిగితే ప్రాణాల్ని కాపాడుకోవచ్చు. అందుకు వేగంగా పోయే విమానం, హెలికాప్టరులాంటి ఆకాశంలో ఎగిరే సాధనాలుగానీ, మోటారుబోటు, షిప్ లాంటి నీళ్ళలో నడిచేవిగానీ, కావాలి. ఎక్కడ దొరుకుతాయి? సముద్రందాటి చేరిన తీరంవేపు వెళ్ళి చూద్దామా అనుకున్నాను. అటువేపు అలాంటివేవీ దొరకవని నమ్మకంగా తెలుసు. రెండోవేపు ప్రయత్నం చెయ్యాలనుకున్నాను.

మాకున్న అయుర్దాయం ముప్ఫయి ఆరుగంటలు.

ఈ సమయాన్ని వ్యర్థం చెయ్యదలచుకోలేదు.

ఇప్పుడు ఆకలిలేదు. నీరసంకూడా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవలసి వుంటే ఇద్దరం హాయిగా ఏ చెట్టునీడనో పడివుండేవాళ్ళం కొంతసేపు. విశ్రాంతి కోసం వున్న కొద్ది కాలాన్ని దండగ ఖర్చుపెట్టడం విజ్ఞత కాదనిపించింది.

"డెల్లా!" పిలిచాను.

"ఏమిటి?" అడిగింది.

"నేను ముందుకెళ్ళి తీరందగ్గర మన మీ దీవినుండి తప్పించుకెళ్ళేందుకు ఏదైనా సాధనం దొరుకుతుందేమో చూసిరావాలనుకుంటున్నాను. నువ్వు ఇక్కడే వుండి రెస్ట్ తీసుకుంటావా! లేక నాతో వస్తావా?" అడిగాను.

"ఏదైనా దారి దొరికితే నన్నిక్కడే దిగవిడిచేద్దామనుకుంటున్నావా? ఎప్పుడూ వెంటరమ్మని పిలిచేవాడివి! ఇవాళ వస్తావాని అడుగుతున్నావేం?" అడిగింది కోపంగా డెల్లా.

"ఛ! అలా ఎప్పుడూ జరగదు. చచ్చినా, బ్రతికినా జతగానే! నీకు నీరసంగా వుందికదూ! అందుకని అడిగాను" అన్నాను.

"నాకు బాగానే వుంది. వస్తాను" అందామె.

మళ్ళీ రెండు అంతస్తులు వున్న గదికెళ్ళి, కొన్ని బిస్కెట్లు, రెండు విస్కీ సీసాలు తీసుకొచ్చాను.

"వెళ్దామా!" అన్నాను.

"ఊఁ" అంటూ వెంట నడిచింది.

ఇంత పెద్ద రిసర్చి బిల్డింగు కట్టిన ఐక్యరాజ్య సమితి పరిశోధన సంస్థ, ఆక్సిజన్ సిలెండర్లనన్నా తెచ్చి తన సైంటిస్టులకు అవసరమయిన ఘడియల్లో ఎందుకుంచలేదని ఆలోచించసాగాను. అయితే మనిషి అవసరం లేకుండానే అంతకన్నా తెలివిగా, నేర్పుగా, పనిచేసే యంత్ర సాధనాలు శాస్త్రజ్ఞులు కనిపెట్టారు. వాట్ని ఇక్కడ పెట్టి వుండటం గమనించాను. తిరిగ్గా ఎప్పుడైనా వచ్చి అవి నమోదుచేసిన వివరాల్ని వాళ్ళు చూసుకోవచ్చు. అందువల్లే నిర్జనంగా వుందా దీవి అనుకున్నాను.

ఎక్కడో ఒకచోట ఈ దీవిలో 'హెలిపాడ్'నిర్మించి వుండాలి వాళ్ళు. లేకుంటే ఇంత పెద్ద బిల్డింగు కట్టడంగానీ, అందులో అన్నిరకాల యంత్రాలు, పుస్తకాలు తెచ్చిపెట్టడం అసంభవమనుకున్నాను. ఆ హెలిపాడ్ వద్ద ఏదైనా స్పేర్ హెలికాప్టర్ దొరుకుతుందేమోనన్న ఆశ కలిగింది.

హెలిపాడ్ కోసం వెతుకుతూ తిరుగుతున్నాం నేనూ, డెల్లా. తిరిగి తిరిగి అలసిపోతున్నాం తప్ప, అటువంటిదేమీ మా కంటబడలేదు. ఒకచోట సేద తీర్చుకుందామని కూలబడ్డాం.

దగ్గరున్న సామగ్రిలోంచి బిస్కెట్ పాకెట్ ఓపెన్ చేసి ఒక్కొక్కటి తీసుకొని నమలడం మొదలెట్టాం. డెల్లా విస్కీ బాటిల్ కూడా ఓపెన్ చేసింది. మధ్యమధ్య దాంతో గొంతు తడుపుకోసాగాం. కడుపు నిండిందనిపించిందాకా తిన్నాం, ఆ తర్వాత సిగరెట్లు వెలిగించాం. హాయిగా దమ్ములాగుతూ గాల్లోకి వలయాలుగా పొగను

వదలుతూ కూర్చున్నాను నేను. నా కేసి చూస్తూ కూర్చుంది డెల్లా. ఇద్దరం చాలా సేపు మౌనంగానే వుండిపోయాం.

నాకు ప్రస్తుతం మేమున్న ప్రాణాపాయ పరిస్థితినుంచి తప్పించుకోనేందుకు ఎటువంటి మార్గమూ ఎంత ఆలోచించినా, తల బ్రద్దలుకొట్టుకొన్నా తోచడంలేదు. ఏదైనా హెలికాప్టర్ లాటిదన్నా కనుపిస్తే దాని సాయంతో కొన్ని వందల మైళ్ళు పారిపోగలమన్న ధైర్యం కలిగేది. అదీ లేదు.

నేనున్న దీవిపై వీచబోయే విష పుగాలులు మరో ఇరవై నాలుగు గంటల్లో ప్రారంభం కాబోవడం, సరిగ్గా ఆ టయమ్‌కే నేనూ డెల్లా ఇక్కడికి చేరుకోవడంవిచిత్రంగా తోచింది నాకు.

"రాజ్!" పిలిచింది డెల్లా.

తలెత్తి చూశాను, ఆలోచనలనుండి తేరుకుంటూ.

"మనం ఇక్కడనుండి పారిపోయే అవకాశం లేదు. మనకు ప్రమాదం తెచ్చిపెట్టేది ఒక మనిషో, వస్తువో కాదు. ప్రాణాలు పోసేది, పెంచేది, అయిన ప్రకృతి. అది సమస్త జంతుజాలాన్ని మానవలోకాన్ని నాశనం చేసేందుకన్నట్లు ప్రజ్వరిల్లి వస్తుందంటే నా కెందుకో నమ్మ బుద్ధి కావడంలేదు. మనం ఖచ్చితంగా తప్పించుకొనే మార్గ మొకటి వుండి తీరాలనిపిస్తూంది. కానీ అదేదయిందీ సరిగా తెలిసి చావటంలేదు!" అంది డెల్లా.

"నీ పిచ్చి నీ కిలాంటి ఆలోచనల్ని తెస్తూంది. అంత మంది శాస్త్రజ్ఞులు ఈ దీవిని వదలి వెళ్ళిపోయి ఎక్కడో దూరంనుంచి తమ పరిశోధనలకు అవసరమైన సమాచారాన్ని సమకూర్చుకుంటున్నారంటే, రాబోయే విష పు

గాలులు ఎంత తీవ్రమైనవో నీకు అర్థం కావడంలేదా?''
అడిగాను నేను.

''మీ దేశంలో చాలామంది యోగాసనాలు వేస్తుంటారు. దాన్ని గురించి తెలుసా?''

''ఇప్పుడు వాటి సంగతి ఎందుకు?'' అడిగాను ఆశ్చర్యంగా.

''అవసరం వుందిగనకే అడిగాను'' అంది డెల్లా.

''కొంత తెలుసు.''

''మీ దేశంలో చాలామంది మామూలు మనుషులు పొట్ట కూటికోసం పబ్లిక్ ప్లేస్‌లో పెద్దగుంటలు త్రవ్వి అందులో తల, మెడ కొంత భాగంవరకు గుండె పెట్టి, ఆ తర్వాత మట్టితో పూడ్పించేసుకొని రోజుల పర్యంతం వుంటారని పత్రికల్లో చదివాను. నిజమేనా?'' అడిగింది డెల్లా.

''నిజమే!'' చెప్పాను.

''నువ్వు చూశావా?''

''చూశాను.''

''అలా చెయ్యగలమా మనం?''

ఆ ప్రశ్నతో ఆమె ఆలోచన అర్థమయింది నాకు. విషపుగాలులు వీచినా వాటిని మేము పీల్చవలసిన అవసరం లేకుండా ఇరవైనాలుగు గంటలకాలం ప్రాణాయామం చెయ్యమని ఆమె సలహా. చెయ్యగలిగితే ఇది రానున్న ప్రమాదాన్ని తప్పించుకోనేందుకు నిజంగా ఒక మంచి మార్గమే.

''అందుకు చాలా సాధన అవసరం. అందరూ అలా ఊగ్గ బట్టుకొని భూమిలో లభ్యమయ్యే కొద్ది ఆక్సిజన్‌తో ప్రాణాలు నిలబెట్టుకోలేరు డెల్లా!'' చెప్పాను.

"అవసరంకోసం చెయ్యాలి మనం. ఇలాంటప్పుడు సాధనం ప్రసక్తి రాదు. మనం ఊపిరాడక చచ్చినా ఫరవాలేదు. చావు తప్పదని తెలిశాక బ్రతికేందుకో ప్రయత్నం చేశామన్న తృప్తి మనకు మిగులుతుంది గదా ఇలా చేస్తే!"

అవునన్నట్లు తలూపాను.

"అయితే మనంకూడా ప్రయత్నిద్దాం!" అంది డెల్లా.

"సరే!" అన్నాను.

నా ఒప్పుకోలు డెల్లాను ఆనందంలో ముంచింది.

"ఇక మనం తగిన స్థలం చూసుకోవాలి. అక్కడ మనమే రెండుగోతులు త్రవ్వుకోవాలి." అంది డెల్లా.

"అవును!" అన్నాను, ఆ గోతులు, మా గోరీలు కాకుండా వుండేట్లు చూడమని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ మనస్సులో.

"ఎలాంటి ప్రదేశమయితే బాగుంటుంది?" అడిగింది డెల్లా.

ఆలోచించసాగాను. సులభంగా త్రవ్వేందుకు వీలుగా వుండాలి. తగినంత గాలి లభ్యం కావాలి. అంటే రేణువుకు రేణువుకు మధ్యదూరం కాస్త ఎక్కువగా వుండాలి. అలాటి ప్రదేశం ఇసుక ఎక్కువగా వున్నచోట్ల తప్ప మరోచోట దొరకదు. సముద్రతీరానికి కాస్త దూరంగా అయితే నేననుకొన్న రకం ప్రదేశం లభ్యమవుతుందని తీర్మానించుకున్నాను.

నా ఆలోచనలు డెల్లాకు చెప్పాను.

ఆమె నా అభిప్రాయాల్తో ఏకీభవించింది.

ఇద్దరం అక్కడ్నించి లేచాం. హెలిపాడ్ వెతికే ప్రయత్నం మానుకున్నాం. సముద్రం వేపుకు నడక ప్రారంభించాం.

కొంతదూరం నడిచేసరికి ఆకాశంలో ఏదో విమానం వస్తున్న చప్పుడయింది. ఇద్దరం తలెత్తి పైకి చూచాం. దూరంగా చుక్కలా కనిపించింది విమానం. అది బహుశా మేమున్న దీవిలో దిగేందుకే వస్తుందేమోనని అక్కడ నిలబడిపోయాం చూస్తూ.

ఐదు నిముషాల్లో ఆ విమానం మా నడనెత్తికొచ్చింది. ఆ తర్వాత రెండుకందల అడుగుల ఎత్తున మాకు దగ్గరలోనే ప్రదక్షిణాలు చెయ్యసాగింది. దాని శబ్దానికి మా చెవులు చిల్లులు పడిపోతున్నాయి. ఒకటీ రెండూ కాదు, దాదాపు వందసార్లు ప్రదక్షిణం చేసింది. ఎత్తు మారడం లేదు.

ఉన్నట్టుండి విమానం క్రిందిభాగంలో ఒక తలుపు లాంటిదేదో తెరచుకోవడం, దాన్లోంచి పేరాచూట్ వెలుపలికి రావడం గమనించాను నేను. దాని సాయంగా ఎవరైనా మనిషి దిగుతున్నాడేమో ఈ దీవిపైన అనుకున్నాను. డెల్లాకూడా చూసిందా సంఘటన.

"ఎవరో దిగినట్లుంది ఆ విమానంలోంచి!" అన్నాను. విమానంమాత్రం ఆగకుండా, ఇంకా సర్కిల్ చేస్తూనే వుంది. పైకిపోయే ప్రయత్నంలో ఏమాత్రం లేదని అర్ధమయింది నాకు దాని పద్ధతి చూశాక.

"అవును. పేరాచూట్ నేను చూశాను" అంది డెల్లా.

"అతను, ప్రాణాలు నిలబెట్టుకునేందుకు అవసరమైన

అన్ని ఏర్పాట్లు చేసుకొనే వచ్చివుంటాడు. వెళ్ళి అతన్ని పట్టుకుందాం. మనల్నికూడా అతనే బ్రతికిస్తాడు" అన్నాను.

"ఒకవేళ అతను, తనవరకే ఏర్పాట్లు చేసుకుని వచ్చి వుంటే ఏం చేద్దాం?" అడిగింది డెల్లా.

"వాడొక్కడు. మనం ఇద్దరం. వాణ్ణి చంపనైనా మనం బ్రతికే దారి చూసుకుందాం!" అన్నాను.

"గుడ్!" అంది డెల్లా.

ఇద్దరం ఆ విమానం తిరుగుతున్న వేపుకు వడివడిగా అడుగులు వేశాం. అరగంటకన్నా తక్కువ వ్యవధిలోనే ఆ ప్రాంతం చేరుకున్నాం. చిన్నచిన్న దిబ్బలు, రాతి గుట్టలు, ముళ్ళకంపలు వున్నాయి ఆ ప్రదేశంలో. పేరాచూట్ కోసం వెతుక్కుంటూ తిరిగాం. మరో అరగంట తర్వాతగాని దాని జాడ తెలుసుకోలేకపోయాం. మా హడావుడిలో విమానం శబ్దం ఎప్పుడు ఆగిపోయిందికూడా గుర్తు పెట్టుకోలేదు. శబ్దంమాత్రం వినరావడంలేదు. వచ్చిన పని పూర్తయింది గాబట్టి విమానం వెనక్కి వెళ్ళిపోయి వుంటుందని అనుకున్నాను నేను.

ఒక చిన్న రాతిగుట్టను అనుకుని పడుంది పేరాచూట్. వెళ్ళి దాన్ని ప్రక్కకు లాగాం. అడుగుభాగాన పెట్టెలాంటి చిన్న యంత్రమేదో వుంది. దాన్ని తేరిపార చూశాను. దానిపైన యు. ఎస్. ఏ. సైంటిస్టులు వాడే మోనోగ్రామ్ తప్ప మరేవిధమైన వివరాలు లేవు. ఇది కూడా వాళ్ళ పరిశోధనల కుపయోగించే యంత్రమయి వుండాలనుకున్నాను.

కొండను కష్టపడి త్రవ్వి ఎలుకను పట్టినట్లయింది మా శ్రమంతా. ఎంతో ఆశగా పరుగెత్తుకొచ్చాం. అది కాస్తా నిరాశని తేలాక, మళ్ళా మొదటిచోటే ఉండిపోయామని తెలుసుకున్నాం.

"ఆ విమానం ఏమయింది?" అడిగింది డెల్లా.

"ఏమో? నేను గమనించలేదు!" అన్నాను.

"ఇక్కడెక్కడో దిగివుంటుంది. చూద్దాం పదండి" అంటూ దారితీసింది ముందుకు.

నేనూ ఆమెను అనుసరించాను. వందగజాలు నడిచాం. విమానం కనుపించింది. ఆనందంతో ఎగిరి గంతులేయవలసిన మాకు వెచ్చగా దూరంనుండే సెగ తగిలింది. ఎర్రగా, చింతనిప్పు కణికలా కాలిపోయివున్న విమానం భగభగ మండుతూ కనుపించింది.

"ఇది పైలట్ లెస్ విమానం. దూరం, వేగం, అన్నీ సెట్ చేసి పంపివుంటారు. సరిగ్గా ఈ దీవికే రావటానికి వీలుగా, ఏదో దూరంగావున్న ఎయిరోడ్రామ్‌నుంచి సెట్ లైట్ ద్వారా, ఈ విమానం యొక్క డైరక్షను, ఆల్టిట్యూడ్, స్పీడ్, కంట్రోలు చేసివుంటారు. దాని పని అది నిర్వహించగానే క్రిందికి కూలిపోయింది. అలా వేగంగా కూలిపోవడంలో గాస్ టాంక్ బ్రద్దలై మంటల్లో చిక్కుకుని వుంటుంది" అన్నాను.

చైతన్యరహితంగా, కత్తిగాటుకు నెత్తురుచుక్క రానట్లు, మొహం పెట్టుకుని ఆ మంటలకేసి చూస్తూ నిలుచుంది డెల్లా. ఆమెలో రేగిన ఆశలుకూడా బహుశా ఆ మంటల్లోనే తగలబడిపోయా యనుకుందేమోనని తలచి

బాధపడడం తప్ప నేను చేయగలిగిందికూడా ఏమీ లేదు.

నా వేపుకు తిరిగింది డెల్లా.

ఆమె కళ్ళలోకి సూటిగా చూశాను. అవి అంతదాకా కారిన నీళ్ళతో తడిసి కాస్త ఎర్రబడ్డాయి.

"రాజ్! చూశావా? ఏమైందో?"

"దాన్ని గురించి బాధపడకు. ఇవి మనకు మామూలే!" అంటూ ఆ విమానం ఎందుకొచ్చిందీ, ఎవరు పంపిందీ, ఎలా కాలిపోయిందీ నాకు తెలిసినంతవరకూ వివరంగా చెప్పాను. డెల్లా ఓపికగా వినింది.

"మనం ముందనుకున్న విధంగా సముద్రప్రాంతానికి వెళ్దామా?" అడిగింది చివరకు.

"అంతకన్నా మరో మార్గం లేనట్లుంది" అన్నాను.

ఇద్దరం అక్కడ్నుంచి వెనక్కు బయలుదేరాం.

అంతకుముందు మేము ఆలోచించిన పధకం గురించి నా మెదడు తర్కవితర్కాలు చెయ్యడం మొదలెట్టింది. గోతులు త్రవ్వుకుని తలలు అందులో పెట్టుకున్నాక ఎదురయ్యే సమస్య లన్నింటినీ లెఖవేశాను.

శాస్త్రజ్ఞుల అంచనాప్రకారం విషవుగాలులు దాదాపు ఇరవై నాలుగు గంటల సేపు వీస్తాయి యీ దీవిపైన. అంత సేపు మేము దమ్ముపట్టి తలలు నేలలో పెట్టి, అక్కడ చిక్కే కొద్దిపాటి ఆక్సిజన్‌తో ప్రాణాలు పోకుండా కాపాడుకోగలమా అన్నది అనుమానాస్పదమైనవిషయం. ఆతర్వాత, ఇరవై నాలుగు గంటలయిందీ, కానిదీ మాకు తెనిపే వారుకానీ, తెలిసేదారికానీ లేదు. అంచనాలు తప్పయి ముందే వెలుపలికి తలలు తీశామంటే ప్రక్కన

ప్రాణాలు పోతాయి.

ఆ పైన, మేము ఎన్నుకోదలచుకున్న ప్రదేశం సముద్ర తీరం, ఇసుక ప్రాంతం మేము తలలు లోపల పెట్టాక, ఏదైనా ఇసుక తుఫాను లాంటిది వచ్చిందంటే మమ్మల్ని తప్పివేస్తూ ఇసుక మేట వేసుకుపోయే ప్రమాదముంది. అలా జరిగిన పక్షంలో ఇక వెలుపలికి రావడమనేది లేదు. ఆ అపాయం నుండి తప్పించుకొనే మార్గం కూడా ముందే వెతుక్కోవాలి.

భూమిలో తల పెట్టాక, వూడ్చుకునేప్పుడు ఇసుక చెవులు, ముక్కు, కళ్ళు, నోరు తొడభాగాల్లోకిపోవచ్చు అలా పోయిందంటే ఊపిరాడదు. అలా పోకుండా చూసుకోవలసిన అవసరంకూడా వుంది.

ఈ సమస్యలన్నీ సక్రమంగా, మాకు తృప్తికరంగా పరిష్కారం చేసుకోగలిగినప్పుడే, మా పథకం ఫలించి మా ప్రాణాలు పోకుండా నిలబడతాయన్నది నిర్వివాదాంశం.

అరగంట పైనే నడిచాం విమానం కాలిపోయినప్రాంతాన్నుండి సముద్రం వేపుకు. ఒకచోట ఆగి చుట్టూ చూసుకున్నాం.

"ఇక్కడ బాగుందికదూ!" అడిగింది డెల్లా.

"ఆఁ!" అంటూ తలూపాను.

"గోతులు త్రవ్వుకుందామా?" అంది ఆమె మళ్ళీ.

గోతులు అన్నమాట గోరీలుగా వినిపించింది నాకు.

"ఆఁ! కానీ దేంతో త్రవ్వుకుందాం. చేతుల్తో త్రవ్వటం కష్టం. ఏదైనా పారలాంటిదుంటే బావుంటుంది"

అన్నాను.

"ఆ బిల్డింగులోకి వెళ్ళి చూద్దాం. ఏదైనా దొరుకుతుం దేమో?" అన్నాను.

ఆమెకూడా తలూపింది.

ఇద్దరం బిల్డింగుకు బయలుదేరాం.

"అక్కడ మరికొన్ని పరికరాలుకూడా చూచుకోవాలి మనం!" అన్నాను దగ్గరికంటూ వచ్చాక.

పరికరాలు ఏమిటూ అన్నట్లు చూసింది.

"మన కళ్లూ, ముక్కూ, చెవులూ, నోరూ ఇసుకతో నిండిపోకుండా అడ్డుగా వుండేందుకు పనికొచ్చే గ్లాస్ కాటన్ కావాలి. టైమ్ ఇరవై నాలుగు గంటలు అయినట్లు తెలిసేందుకు అలారం కొట్టే చిన్న టైంపీస్ లాంటిదేదన్నా చూసుకొని దాన్నికూడా మనతోనే పాతిపెట్టుకోవాలి!" అన్నాను.

"గుడ్! నీ బ్రెయిన్ అద్భుతంగా పనిచేస్తుంది!" అంది డెల్లా.

"అన్నింటినీ మించి మరో పెద్ద ప్రమాదం సంభవించే అవకాశముంది. దాన్నుంచికూడా బైటపడే మార్గం ఆలోచించాలి" అన్నాను.

"ఏమిటది?"

ఇసుక తుఫానులు రావటం, వాటివల్ల మాకు జరగబోయే అపకారం వివరంగా చెప్పాను. విని వెర్రిముఖం

పెట్టి తలవాల్చేసింది డేల్లా.

"అలాంటిది జరిగితే మనల్ని ఎవరు రక్షిస్తారు?" అడిగింది డేల్లా భయంగా.

"అదే ఆలోచిస్తున్నాను ఇందాకట్నుంచి" అన్నాను.

అంతలోనే బిల్డింగు దగ్గర కొచ్చేశాం ఇద్దరం. తలుపులు తెరచుకొని లోనికి ప్రవేశించాం. క్రింది భాగం మొత్తం గాలించాం. మట్టిత్రవ్వే లారీలకత్తే పవర్ కనుపించింది. దాన్ని తీసుకున్నాం. ఆ తర్వాత మూడు అంతస్తులోకి జొరబడ్డాం. అక్కడ అల్మైరాలన్నీ తెరచి చక్కబెట్టాం. గ్లాస్ కాటన్ కనుపించింది. రెండు రోల్స్ తీసుకొని పాంటు జేబుల్లో కుక్కుకున్నాను.

అక్కడే ట్రాన్సిస్టరుతో పనిచేసే చిన్న అలారం టైంపీస్ దొరికింది. దాన్ని కూడా తీసి జేబులో వేసుకున్నాను. దాంతో నేను ఎదురుచూసిన నాలుగింటిలోని మూడు సమస్యలకు పరిష్కార మార్గం దొరికింది. నాలుగోది మాత్రం అపరిష్కృతంగా మిగిలిపోయింది.

అక్కడే కూర్చొని ఆలోచించసాగాను.

ఉన్నట్టుండి మెరుపులా మెరిసింది నాకో ఆలోచన. విషవుగాలులు వీచిన కొంతసేపటికల్లా ఈ రిసెర్చి సెంటరుకు శాస్త్రజ్ఞులు, వాళ్ళ అసిస్టెంట్లు మొదలైనవాళ్ళంతా చేరుకుంటారు, తమ ప్రయోగాల ఫలితాల్ని తెలుసుకునేందుకు. వాళ్ళకు తమ పరిస్థితి వివరిస్తూ ఉత్తరం రాసిపెట్టి, కాపాడమని అర్థిస్తే, ఆ ఉత్తరం చదివి వాళ్లొచ్చి తమను

రక్షించే అవకాశంముంది, అంతకన్నా మరో మంచి దారి లేదనిపించింది.

ఒక కాగితం, పెన్నూ తీసుకొని, మేము ఎంచుకొన్న ప్రదేశం, బిల్డింగుకి ఏ కోణంలో, ఎంత దూరంలో వున్నదీ, తెలిపే బొమ్మగీచాను. ఆ ప్రదేశంవద్ద రెండు గుండు సున్నలు చుట్టి అందులో ఇంటూలుపెట్టి మార్క్ చేశాను కాగితం వెనుక వేపున, మా వివరాలు, మేమెలా ఈ దీవి కొచ్చిందీ, విషపు గాలుల్నించి తప్పించుకోవటానికి, ఎటు వంటి ప్రయత్నం చేస్తున్నదీ మొదలైనదంతా వివరంగా రాశాను.

మేము ఎదురుచూస్తున్న ఇసక తుఫానుల ప్రమాదం గురించి కూడా తెలియపరచాను. దీవి చేరంగానే మమ్మల్ని వెలికితీసే ప్రయత్నం ముందుగా చెయ్యమన్న నా అభ్యర్థనను అందులో ఎరుకపరచాను. మా ప్రాణాలు పోవడం జరిగితే శవాల్ని ఏ దేశాలకు పంపవలసిందీ, అడ్రసులతో సహా తెలియపర్చాను.

రాయడం ముగించాక కాగితాన్ని డెల్లాకు అంద జేశాను చదవమని. ఆమె తదేకంగా చదివింది. తిరిగి కాగి తాన్ని నా కందిచ్చింది.

"నేను రాసింది చాలుగా?" అడిగాను.

"చాలు!" అంది డెల్లా.

ఆ కాగితాన్ని తీసుకెళ్ళి మూడో అంతస్తులో వున్న పెద్ద మిషను ప్రక్కనున్న పేపర్ రెస్టర్‌లో అమర్చాను.

అక్కడైతే అది వాళ్ళ దృష్టిని సులభంగా ఆకర్షిస్తుందన్న ఉద్దేశ్యంతో.

బిల్డింగులోంచి మేము సేకరించుకున్న సామగ్రి తీసుకొని బైట పడ్డాం. మళ్ళీ అంతకు ముందుకు గుర్తు పెట్టుకొన్న సముద్రతీర ప్రదేశం వేపు నడక సాగించాం.

గాలిలో ఆక్సిజన్ పాలు తక్కువవుతున్నట్లు తోచింది నాకు. ఎంత గాలి పీల్చినా ఊపిరి అందడం లేదు, తేమ కూడా అంతకుముందుకన్నా కాస్త ఎక్కువ పాళ్ళలో వున్నట్లు తోచింది.

మేము గుర్తు పెట్టుకున్న స్పాట్ చేరుకున్నాం. షెవల్ తీసుకొని త్రవ్వడం మొదలెట్టాను. డెల్లా చేతులతో ఇసుకను గొయ్యి అంచులపైకి లాగడం ప్రారంభం చేసింది. పధ్నాలుగు అంగుళాలలోతు గొయ్యి తీశాను. షవల్ ప్రక్కనే పెట్టాను.

"ఆగావేం? మరో గొయ్యి తియ్యొద్దూ?" అడిగింది డెల్లా.

"కాదు! ఓమారు ట్రయల్ చూస్తాను. ఆ తర్వాత రెండోది త్రవ్వుదాం!" అన్నాను నేను.

"సరే!" అంది.

నేను గాజుగుడ్డ మొఖానికి చెవులకు కప్పడిపోయేట్లుగా కట్టుకున్నాను. తలగొయ్యిలో పెట్టాను. చేతులు రెండూ గొయ్యి అంచులపైన ఉండేట్లుగా అమర్చ

కున్నాను. ఇసుకలోనికి తోయమని సైగ చేశాను డేల్లాకు.

"నువ్వే తోసుకో! ఆ తర్వాత ఎటు ఎవరి గొయ్యి వారు పూడ్చుకోవల్సిందేగా?" అంది.

ఆమె మాటలుకూడా సబబుగానే కనుపించాయి. నేనే చేతుల్తో అంచులపైనున్న ఇసుకను త్రోసుకో సాగాను. రెండు నిముషాల్లో మెడదాకా ఇసుకపడింది.

నాకేవిధమైన శబ్దం వినిపించడం లేదు. గాలి చాలా కొద్దిగా వస్తూంది. కానీ వెలుపలి గాలిలోకన్నా ఇసుక రేణువుల మధ్యనుంచి వస్తున్న గాలిలో ఆక్సిజన్ ఎక్కువ పాళ్ళల్లో వున్నట్లు అర్థమయింది. కళ్ళు మూతబడి వున్నాయి. అందువల్ల విపరీతంగా చీకటి పేరుకుని పోయింది. ఊపిరితిత్తులపైన ఒత్తిడి ఎక్కువయింది. గాలి పీల్చేందుకు వాటంగా పెద్దవి చెయ్యవలసి వస్తుంది. అలా ఇరవై నాలుగు గంటలు వుండటం సులభంకాదని మాత్రం అర్థమయింది నాకు ఆ రెండు నిముషాల అనుభవంలోనే. అంతలోనే ఇండియాలో, కొంతమంది రోజులు కాదు, దాదాపు వారాలు, కొన్ని సందర్భాల్లో నెలలు అలా నేలలో ఎలా వుండగలుగుతున్నారో అర్థంకాక కాసేపు ఆలోచించసాగాను.

వెలుపలికి తల తీసేద్దామనుకున్నాను. నా తలచుట్టూ వున్న ఇసుకను లాగెయ్యమన్నట్లు, గుర్తుగా కాళ్ళాడించాను డేల్లా తెలుసుకోవటం కోసం.

రెండునిముషాల్లో డెల్లా ఇసుకంతా తీసేసింది, తల బైటికి పెట్టాను. మొఖానికి కట్టుకున్న గుడ్డ విప్పాను. అరచేతుల్తో కళ్ళను ఘట్టిగా అద్దుకొని మెల్ల మెల్లగా తెరుస్తూ కొద్దికొద్దిగా వెలుతురును చూడసాగాను. పూర్తిగా కళ్ళు తెరవడానికి దాదాపు ఒక నిముషం పట్టింది.

"ఎలా వుంది?" అడిగింది డెల్లా.

"ఏమిటీ?" అడిగాను నవ్వుతూ.

"మీ అనుభవం?"

"బాగానే వుంది" అన్నాను.

"అంటే ఎలా అర్థమవుతుంది. కాస్త వివరంగా చెప్పు!" అంది డెల్లా.

"అంత భయంకరంగా లేదు. ఊపిరాడుతూనే వుంది. ఊపిరితిత్తుల్ని మాత్రం ఎక్కువ అలసట పెట్టకుండా దమ్ము పెట్టి గాలి పీల్చాలి. అలాగే మెల్లగా వదలాలి. అలా చేస్తే మనం ప్రాణాలతో తిరిగి బైటపడే అవకాశం వుంటుందనుకుంటాను" అన్నాను.

"నాకో అనుమానం వచ్చింది" అంది పక్కన డెల్లా.

"ఏమిటది?"

"మనం తలలు భూమిలో పెట్టుకుని పడున్నా, అక్కడ వచ్చే గాలిలో మాత్రం విషపుఛాయ లుండ వన్న గ్యారంటీ ఏమైనా వుందా? లేదా? అలా లేనప్పుడు మన ప్రయత్నం మొత్తం వృధాయేకదా?" నిస్పృహతో చూసింది నన్ను.

ఒక్కక్షణం నాకూ అర్థంకాలేదు ఆ సమస్యకు సమాధానం.

ఆలోచించసాగాను. సముద్రంలో బ్రతికే చేపలు భూమిలో పెరిగే ఎర్రలు మొదలైనవాటికి ప్రాణవాయువు అక్కడికక్కడే దొరుకుతుండటం తెలుసుకున్నాను చదువుకొనే రోజుల్లో. అలాగే భూమిలోపలి పొరల్లో వుండే గాలికీ, వెలుపలిగాలికీ బహుశా సంబంధం వుండకపోవచ్చు ననిపించింది. ఆ అభిప్రాయమే డెల్లాకు తెలియ పరచాను.

"అలా అయితే బ్రతుకుతాం! లేకుంటే ఇంత ప్రయత్నం చేసీ నిష్ప్రయోజన మవుతుంది!" అంది డెల్లా.

"అలా ఎందుకనుకోవాలి! ప్రయత్నం చెయ్యాడం మన బాధ్యత. ఫలితాలు దైవాధీనాలు" అన్నాను.

పవల్ తీసుకొని ముందు త్రవ్విన గొయ్యి ప్రక్కనే మరో గొయ్యి త్రవ్వసాగాను. డెల్లా చేతుల్తో మట్టి తీసి అంచులపైన సర్దసాగింది. అదీ పద్నాలుగంగుళాల లోతు కాగానే ఆపి, పవల్ ప్రక్కన పడేశాను.

"గడియారం నా దగ్గర పెట్టుకొంటాను" అన్నాను.

"అలాగే!" అంది డెల్లా.

"మన చేతులు ఒకదాని కొకటి తగిలేట్లుగా అరేంజ్ చేసుకుందాం. కనీసం చచ్చేప్పుడూ కలసి చచ్చినట్లన్నా వుంటుంది. అలా చావకుంటే ఎవరు బ్రతికివుండీ, ఎవరు చచ్చిందీ స్పర్శను బట్టన్నా తెలుసుకోవచ్చు" అన్నాను.

"గుడ్ ఐడియా!" అంది డెల్లా,

"పవల్‌ను కూడా మనకు దగ్గరగా నిలువున పాతి పెడతాను. మనకోసం వెతుకుతూ వచ్చే వాళ్ళ కది ఆచూకీఅన్నా ఇస్తుంది!" అన్నాను.

"ఈ ఐడియా నిజంగా చాలా బాగుంది!" అంది డెల్లా.

"మనం ఎన్ని గంటలకు గోతుల్లోకి దిగుదాం" అని అడిగింది తిరిగి.

"ఈ విషపు గాలులు వీస్తున్నట్లు అనుమానం రాగానే తలలు గోతుల్లో పెట్టేద్దాం! శాస్త్రజ్ఞుల లెఖ్ఖ ప్రకారం ఇంకా ఎనిమిదిగంటలా ఇరవై ఆరు నిముషాల వ్యవధి వుంది ఆ గాలులు ప్రారంభం కావడానికి" అన్నాను.

నాకు క్షణక్షణానికి అనుమానం ఎక్కువకావడం మొదలైంది. ఊపిరి ఆడటం కాస్త కష్టమవుతున్నట్లు తోచసాగింది. అదంతా విషపుగాలుల ప్రభావమేమో ననిపించసాగింది. డెల్లా మాత్రం మాటా పలుకూ లేకుండా ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తూ, ఇసుకలో వ్రేళ్ళతో గీస్తూ కూచుంది.

"డెల్లా!" పిలిచాను మెల్లిగా.

ఏమిటన్నట్లు తలెత్తి చూసింది నాకేసి.

"ఎలా వుంది?" అడిగాను.

"ఏది?"

"గాలి!"

"అంటే..." అర్థం గానట్లు చూస్తూ అడిగింది.

"విషం కలసినట్లు అనుమానంగా ఏమన్నా వుందా నీకు?"అడిగాను నా అనుమానం నివృత్తి చేసుకోనేందుకు.

"ఇంకా చాలా వ్యవధి వుందని నువ్వే చెప్పావుగా? అయినా నాకేం అలాంటి అనుమానం కలగడం లేదు. మనం దీవిపైన కాలు పెట్టినప్పుడు ఎలా వుందో ఇప్పుడూ అలాగే వున్నట్లనిపిస్తుంది" అంది డెల్లా.

(సశేషం)